క్లుప్తంగా

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి కలిశారు. బుధవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. ఆయన వెంట ఎం. శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, టీఓ పల్లి రవి శంకర్‌రెడ్డి ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్‌జిల్లాలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు జాతీయ ఉపాధ్యాయ అవార్డు–2025నకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న అర్హత, ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హత గలవారు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను నిర్ణీత సమయంలోపు సమర్పించాలని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని జమ్మలమడుగు మండలం గండికోటలో ఈ నెల 14వ తేదీ జరిగిన బాలిక హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి లక్ష్మీదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఐఎస్ సుబ్బమ్మలు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో చదువుతున్న అమ్మాయి గండికోటలో శవమై కనిపించడం బాధాకరమని తెలిపారు. ప్రేమ పేరుతో, పరువు పేరుతో విద్యార్థినులను హత్య చేయడం దారుణమని చెప్పారు.

పరామర్శ



రత్నకుమారిని పరామర్శిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రత్నకుమారిని మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పరామర్శించారు. కాలు విరిగి విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను బుధవారం రాజారెడ్డి వీధిలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఘటన జరగడానికి గల కారణాలను తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రమీల రాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేసా ప్రసాద్, ఐస్‌క్రీం రవి, రామచంద్రయ్య, దాసరి శివ, రామ్మోహన్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, మూలే సరస్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

■ చెన్నై చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డాక్టర్ నాగార్జునరెడ్డిని మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా బుధవారం పరామర్శించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారన్న కారణంతో ఈనెల 15వ తేది పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించే విధంగా ఆ ఫ్లెక్సీ ఉందని ఆయనపై పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయగా, కడప మెజిస్ట్రేట్ ఆ సెక్షన్లు వర్తించవని చెబుతూ రిమాండ్‌ను తిరస్కరించారు. బుధవారం విడుదలైన ఆయనను మేయర్, మాజీ డిప్యూటీ సీఎం పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు ఏ1 నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధే లక్ష్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని సీపీఐ నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ ఎర్రముక్కపల్లె శాఖ మహాసభలను నిర్వహించి నగర మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు సీపీఐ ప్రాథమిక స్థాయి శాఖ మొదలుకొని నగర, జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు. సీపీఐ నగర 7వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు హాజరవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కడప నగర సమగ్ర అభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలు, ప్రజా ఎజెండాను రూపొందించుకొని భవిష్యత్తు ఉద్యమానికి నాంది పలికే విధంగా సీపీఐ నగర మహాసభలు అందుకు వేదిక కానున్నాయన్నారు. సీపీఐ నాయకులు వేణుగోపాల్ నగర సహాయ కార్యదర్శిలు కేసీ బాదుల్లా, సీపీఐ సీనియర్ నాయకులు నాగార్జున రెడ్డి, ఎర్రముక్కపల్లె శాఖ కార్యదర్శి వేముల ఓబులేసు, కాంతమ్మ, సుబ్బారాయుడు, లక్ష్మీ నరసమ్మ, పార్వతి, ప్రియదర్శిని, హేమ పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతలు అభివృద్ధి నిరోధకులు

- వైఎస్సార్‌సీపీతోనే కడప నగరాభివృద్ధి సాధ్యం
- మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



34వ డివిజన్‌లో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : అధికార పార్టీ నేతలు అభివృద్ధి నిరోధకులుగా మారారని మేయర్ కె. సురేష్ బాబు విమర్శించారు. బుధవారం 29,26, 27, 35, 34, 33, 36, 38, 37, 39, 47, 31, 30 డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024 డిసెంబర్ 23న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తన కుర్చీ కోసం అధికారులు వివిధ అంశాలతో రూపొందించిన ఎజెండా ప్రతులను చించేసి, సభ జరుగకుండా ఎమ్మెల్యే మాధవి అడుగడుగునా అడ్డుపడ్డారని మండిపడ్డారు. ఆ ఎజెండాలోనే 15 ఆర్థిక సంఘం కింద చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఆనాడు తాను, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎజెండాలోని అంశాలన్నింటినీ ఏకగ్రీవంగా ఆమోదించకపోయి ఉంటే ఈనాడు ఈ పనులు జరిగేవా అని ప్రశ్నించారు. కమిషనర్ వాటిని ఆమోదించకపోతే న్యాయసలహా తీసుకొని ఆమోదించుకున్నామని పేర్కొన్నారు. నగరపాలక వర్గం ఆమోదించిన పనులకు ఎమ్మెల్యే మాధవి ఎలా శంకుస్థాపనలు చేస్తున్నారని నిలదీశారు.

ఎమ్మెల్యేకు చిత్తశుద్ధిలేదు

నగరాభివృద్ధిపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అలా ఉంటే నగర సమస్యలను ప్రభుత్వానికి నివేదించి ప్రత్యేకంగా నిధులు తెచ్చేవారని పేర్కొన్నారు. బుగ్గవంకపై షామీరియా మసీదు, నాగరాజుపేట వద్ద బ్రిడ్జిలు నిర్మించాలని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.20కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి కొత్త జీవో తెచ్చి తేదీలు మార్చి ఆ నిధులు తామే తెచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 13 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు తెచ్చారేమో చెప్పాలని ప్రశ్నించారు. మహానాడు కోసం, టీడీపీ కార్యకర్తల కోసమే బుగ్గవంకలో కంపచెట్లు తొలగించారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలవుతున్నా కడప నగరంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని తెలిపారు.

ఏకపక్షంగా వ్యవహరించే అధికారులకు బుద్ధిచెబుతాం

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ దివంగత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే కడప నగరాభివృద్ధి జరిగిందని తెలపారు. ఈ ప్రభుత్వంలో ఒక్క ఇటుక అటు తీసి ఇటు వేయలేదన్నారు. నగరపాలక అధికారులు మేయర్, కార్పొరేటర్లను గౌరవించకుండా, ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి పాతరేసి ఇలా ఏకపక్షంగా వ్యవహరిస్తూ నగర ప్రథమ పౌరుడైన మేయర్, కార్పొరేటర్లను అవమానించిన వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సి. నాగమణి, షంషీర్, పాకా సురేష్, మగ్బూల్‌బాషా, షఫీ, అజ్మతుల్లా, ఎస్.వాణి, కో ఆప్షన్ సభ్యుడు జహీర్, డివిజన్ ఇన్‌చార్జులు డిష్ జిలాన్, త్యాగరాజు, రఫీ, అక్బర్, చాక్లెట్ గౌస్, పవర్ అల్తాఫ్, బసవరాజు, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, దాసరి శివప్రసాద్, సీహెచ్ వినోద్, గుంటి నాగేంద్ర పాల్గొన్నారు.

సారూ.. న్యాయం చేయండి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు ఓబులేసు తదితరులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె గ్రామ నివాసి పి.ఓబులేసు తనకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. బుధవారం కడప ఆర్డీఓకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామ పొలంలో సర్వే నంబర్ 361/2లో 1.20సెంట్ల పొలం ఉందని, తన పొలం చుట్టుపక్కల తమ సమాజికవర్గానికి చెందిన వారి భూములు ఉన్నాయని, అయితే కొందరు అగ్ర కులాల వారికి అమ్ముకున్నారని తెలిపారు. అయితే తన భూమి పక్కన అప్పటి మండల సర్వేయర్‌తో కొలతలు వేయించి రోడ్డు వేశారని, అయితే అగ్ర కులాల వారు ఎస్సీ వాళ్ల దగ్గర కొన్న భూమిని చూపిస్తూ రోడ్డు తన భూమిలో వస్తుందని సచివాలయంలో ఉన్న సర్వేయర్‌తో చెప్పిస్తున్నారన్నారు. సచివాలయ సర్వేయర్ వాళ్ల దగ్గర డబ్బు తీసుకుని తనను భయపెడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు.

భూ కబ్జాలపై ప్రజా ఉద్యమాలు

- 30న అంబేడ్కర్ సర్కిల్లో ఆందోళన
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల నిర్ణయం



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో ప్రభుత్వ భూములు, స్థలాలను ప్రైవేటు వ్యక్తుల కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని, రానున్న కాలంలో దీని మీద ప్రజా ఉద్యమం నిర్మించాలని అఖిలపక్ష పార్టీ నేతలు నిర్ణయించారు. బుధవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో భూకబ్జాలు, కాలువల, స్మశానాల ఆక్రమణపై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, ఏఐసీసీ నాయకులు సత్తార్, మాట్లాడారు. కడప నగరంలో దాదాపు 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బదలాయింపు జరిగిందని, దీని మీద సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్మశానాలు, కాలువలు, వంకలు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. కడపను కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో ఆందోళన చేపట్టాలని అఖిల పక్షం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సగిలి గుర్రప్ప, సీపీఐ నాయకులు ఆర్ బాబు, ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఆర్ఎంపీఎల్ నాయకులు రమణయ్య, ఎం సీపీఐయూ నాయకులు నాగేంద్ర, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాసిర్ హుస్సేన్, లోక్‌సత్తా పార్టీ నాయకులు శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈగల్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : యువత మాదక ద్రవ్యాలకు బానిస అయితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఈగల్ టీం అధికారులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో కడపలోని చైతన్య అకాడమీ జూనియర్ కళాశాలలో బుధవారం యాంటీ డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ సమాజంలో పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాల సమీప ప్రాంతాలలో కానీ, మీరు నివసించే చుట్టుపక్కల ప్రాంతాలలో కానీ ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డట్లు గుర్తించినా లేదా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీస్ శాఖకు తెలియచేస్తానని కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అగ్రికల్చర్ : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం కడప, మైదుకూరు మండలాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు ఆయా దుకాణాల్లో రిజిస్టర్లు తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. స్టాక్ ఎంత ఉంది, నిర్ణీత ధరలకే అమ్ముతున్నారా లేదా దుకాణాల్లో స్టాక్ నిల్వలు ఏ మేరకు ఉన్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మల్లికార్జునరావు, ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కడప, మైదుకూరు మండలాల్ల సక్రమంగా రికార్డులు నిర్వహించని రూ.36 .99 లక్షల విలువ గల 323.56 మెట్రిక్ టన్నుల ఎరువులు, రూ.5.23 లక్షలకు సంబంధించిన 571.63 లీటర్ల పురుగు మందులు, రూ. 16.03 లక్షల విలువ చేస్తే 409.80 క్వింటాళ్ల విత్తనాలకు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం వ్యాపార లావాదేవీలు కొనసాగించాలి తెలిపారు. ప్రతి రోజు స్టాక్ బోర్డ్, ధరల పట్టికను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మధ్యవర్తిత్వంతో తక్షణ న్యాయం

కడప అర్బన్ : మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించవచ్చని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడప బార్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం మధ్యవర్తిత్వంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వము ప్రాముఖ్యతను తెలియజేశారు. కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.వి. రాఘవరెడ్డి, సెక్రటరీ చంద్రవదన, ప్యానల్ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫక్రుద్దీన్ సేవలు ప్రశంసనీయం

కడప ఎడ్యుకేషన్: పవిత్రమైన హాజీలకు సేవ చేయడం పుణ్యకార్యమని మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్ ఐఏఎస్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హజ్ – 2025 యాత్రకు కడప నగరపాలక ఉర్దూ మెయిన్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌గా విధులు నిర్వహిస్తున్న బెపారి ఫక్రుద్దీన్‌ను గైడ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ సేవలను పలువురు ప్రశంసించారు.

మెడికల్ స్టోర్స్ ప్రారంభం



శ్రీహరి మెడికల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం మద్రాసు రోడ్డు పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద ఉన్న శ్రీహరి మెడికల్ స్టోర్స్ నాల్గవ బ్రాంచ్‌ను బుధవారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరి మెడికల్ స్టోర్స్ అధినేతలు అబ్బూరి వంశీ, కొల్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మారోతు చంద్ర, పతకమూరి నాగభూషణం మాట్లాడుతూ కడప నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలకు అతి తక్కువ ధరలకు మందులను అందించాలనే లక్ష్యంతో కడపలో షాపును ప్రారంభించామని తెలిపారు. మెడికల్ షాపులో సర్జికల్ ఐటమ్స్ విభాగం, మెడిసిన్స్ విభాగము, బేబీకేర్ విభాగములో 20 శాతం డిస్కౌంట్‌తో పాటు అన్ని హాస్పటల్‌లోని డాక్టర్స్ సూచించిన మందులు అతి తక్కువ ధరలకు విక్రయిస్తామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు ఉచిత డెలవరి చేస్తామని పేర్కొన్నారు. అలాగే చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, వాకర్స్, ఊయల, స్త్రోలర్స్, పిల్లల బర్త్‌డే గిఫ్టులు కూడా అందుబాటలో ఉన్నాయని తెలిపారు. కడప శృతి హాస్పటల్ అధినేత మురళీమాధవ్, ప్రత్యూష స్కిన్ కేర్ డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఇట్లయితే ఎట్ల సారూ!

కడప రైల్వే స్టేషన్‌లో పనిచేయని లిఫ్ట్

కడప కోటిరెడ్డి సర్కిల్: నిత్యం వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న కడప రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనిచేయడం లేదు. బుధవారం ఉదయం నుంచి లిఫ్ట్ పనిచేయకపోవడంతో చంటి బిడ్డ తల్లులు, దివ్యాంగులు, వృద్ధులు మెట్లను ఆశ్రయించి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఒకటో ప్లాట్‌ఫామ్ నుంచి మూడో ప్లాట్‌ఫామ్‌కు వెళ్లాలంటే మెట్ల మార్గంలో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. చాలా రోజులుగా మరమ్మతులు చేయక లిఫ్ట్ పనిచేయడం లేదన్నారు. ఇప్పటికైనా లిఫ్ట్ మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

'హిట్ అండ్ రన్' కేసులలో పరిహారం చెల్లింపుపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ కడపలోని జిల్లా కోర్టులో న్యాయసేవాసదన్‌లో బుధవారం 'హిట్ అండ్ రన్' కేసులలో పరిహారం చెల్లింపు అంశాలపై జిల్లా స్థాయి అధికారుల మానిటరింగ్ సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్, రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం.ఆర్ కృష్ణమోహన్, మదనపల్లి సబ్ కలెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

కడప ఎడ్యుకేషన్ : బాలికలు అం కితభావంతో చదివి అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. కడపలోని శ్రీ సాయి జూనియర్ కళాశాల స్వాగతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు తల్లిదండ్రుల ఆశయాలకు అనుకూలంగా లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. కరస్పాండెంట్ పి.రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో క్రమశిక్షణ, ప్రణాళికతో బాలికలు మంచి మార్కులను సాధిస్తున్నారని కొనియాడారు. కళాశాల డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం క్రమం తప్పకుండా ప్రణాళిక యుక్తంగా చదివితే మంచి ర్యాంకు సాధించగలరని చెప్పారు. అనంతరం జూనియర్ ఇంటర్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22 నుంచి అధునాతన తపాలా సేవలు ప్రారంభం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : తపాలా శాఖ ఆధునీకరణలో భాగంగా, కడప పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని 451 తపాలా కార్యాలయాల్లో సాంకేతిక 2.0 విధానాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి అమలు చేయనున్నట్టు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. రాజేష్ తెలిపారు.

బుధవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త విధానంతో తపాలా సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. సాంకేతిక మార్పులతో తపాలా సేవల్లో పెంపు, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వహణ తక్కువ సమయంలో ట్రాకింగ్‌తో వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ విధానం అమలుకు అవసరమైన సన్నాహాల్లో భాగంగా, ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు తపాలా కార్యాలయాల్లో సేవలను తాత్కాలికంగా నిలిపివేసి సాంకేతిక మరమ్మతులు జరుపనున్నట్లు తెలిపారు.

గుర్తింపులేని ఫ్యూచర్ ఆన్ ఫ్రీ స్కూళ్లను సీజ్ చేయాలి



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్ఎస్ఓ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : గుర్తింపు లేకుండా నడుస్తున్న ఫ్యూచర్ ఆన్ ఫ్రీ స్కూల్స్‌ను సీజ్ చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఏడీ రామకృష్ణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపతోపాటు పలు ప్రాంతాల్లో ఫ్యూచర్ ఆన్ ఫ్రీ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నడుపుతున్నారని తెలిపారు. సంబంధిత స్కూళ్లలో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులు ఏర్పాటు చేసుకొని ఏసీ క్యాంపస్ అని తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. గుర్తింపు లేకుండా నడుపుతున్న ఈ స్కూల్‌ను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

క్రీడల్లో భాగస్వామ్యం పెంచుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : క్రీడల్లో క్రీడాకారిణులు భాగస్వామ్యం పెంచుకోవాలని ఖేలో ఇండియా స్టే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హై పెర్ఫార్మెన్స్ మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఆస్మిత లీగ్‌లో భాగంగా మహిళా క్రీడాకారిణులకు ఆర్చరీ, అథ్లెటిక్స్ విభాగంలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో క్రీడాకారిణులు భాగస్వామ్యం పెరగడం కోసం భారత క్రీడా ప్రాధికార సంస్థ తీసుకువచ్చిన అస్మిత లీగ్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారిణులు భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

క్రీడా సామగ్రి అందజేత

కడప ఎడ్యుకేషన్ : కడప అంగడివీధి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు లాంగ్‌జంప్, వాలీబాల్‌కు సంబంధించిన క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు అదే గ్రామానికి చెందిన బుడ్డగాల నాగరాజు నగదు ఇచ్చారని పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు రాజకుంట అగ్గిరప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం గుమ్మల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులకు ఉత్సాహాన్ని నింపేందుకు నాగరాజు క్రీడా సామగ్రి కొనుగోలుచేసేందుకు నగదు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు.